క్లుప్తంగా

నేడు ఇంటింటా ప్రచారం

మదనపల్లె : వైఎస్సార్ సీపీ ఎమ్మెల్యే అభ్యర్థి నిసార్‌అహ్మద్ సోమవారం మండలంలోని కొత్త వారిపల్లె పంచాయతీ కోళ్లవాపుపేట ఆంజనేయ స్వామి గుడిలో ప్రత్యేక పూజల అనంతరం ఎన్నికల ప్రచారాన్ని ప్రారంభిస్తారని వైఎస్సార్ సీపీ కార్యాలయం తెలిపింది. సోమవారం ఉదయం 6.30 గంటలకు కొత్తవారిపల్లె కోళ్లవాపుపేట ఆంజనేయస్వామి ఆలయంలో జరిగే కార్యక్రమానికి మాజీ ఎమ్మెల్యే డాక్టర్.దేశాయ్‌తిప్పారెడ్డి, మాజీ ఎమ్మెల్సీ నరేష్‌కుమార్ రెడ్డి, వైఎస్సార్ సీపీ ప్రజాప్రతినిధులు, ముఖ్యనాయకులు హాజరవుతారన్నారు.

జూదరుల అరెస్ట్

మదనపల్లె : తొమ్మిది మంది జూదరులను అరెస్ట్ చేసినట్లు తాలూకా సీఐ ఎస్.శేఖర్ తెలిపారు. ఆదివారం మండలంలోని కొండామర్రిపల్లె పంచాయతీ బోడుమల్లుదిన్నె సమీపంలో జూదం ఆడుతున్నట్లు సమాచారం అందడంతో సిబ్బందితో కలిసి దాడిచేశామన్నారు. దాడుల్లో జూదం ఆడుతున్న తొమ్మిదిమందిని అదుపులోకి తీసుకుని రూ.12,100 నగదును స్వాధీనం చేసుకున్నామన్నారు. నిందితులపై కేసు నమోదుచేసి కోర్టుకు హాజరుపరిచామన్నారు.

సారా విక్రేత..

నిమ్మనపల్లె : అక్రమంగా సారా విక్రయిస్తున్న మహిళను అరెస్ట్ చేసినట్లు ఎస్ఐ లోకేష్‌రెడ్డి తెలిపారు. ఆదివారం మండలంలోని ముష్టూరు పంచాయతీ దిగువపల్లెలో సారా విక్రయాలు జరుగుతున్నట్లు సమాచారం అందడంతో సిబ్బందితో కలిసి దాడిచేశామన్నారు. స్థానికంగా సారా విక్రయిస్తున్న భూదేవి(38)ని అదుపులోకి తీసుకుని ఆమె నుంచి 30 లీటర్ల సారా స్వాధీనం చేసుకున్నామన్నారు. నిందితురాలిపై కేసు నమోదుచేసి రిమాండ్ నిమిత్తం కోర్టుకు హాజరుపరిచామన్నారు.

వైఎస్సార్ సీపీ ఇంటింటి ప్రచారంలో పాల్గొనండి

కలకడ : మండలంలోని ఎనుగొండపాళ్యం పంచాయతీలో సోమవారం నుంచి ప్రారంభించనున్న ఇంటింటి ఎన్నికల ప్రచారంలో వైఎస్సార్ సీపీ కార్యకర్తలు, అభిమానులు పాల్గొనాలని వైఎస్సార్‌సీపీ మండల కన్వీనర్ కమలాకర్‌రెడ్డి, మండల జెసిఎస్ కన్వీనర్ మోహన్ రాజ్ కోరారు. ముఖ్యమంత్రి వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి చేసిన అభివృద్ధిని ప్రజలకు తెలియజేయాలన్నారు. ఉదయం 7గంటల నుంచి ఎనుగొండపాళ్యం పంచాయతీలో వాల్మీకిపురం మాజీ జెడ్పీటీసీ సభ్యులు చింతల శివానందరెడ్డి ఇంటింటి ప్రచారంలో పాల్గొంటారని తెలిపారు.

వాహనాల తనిఖీ

ములకలచెరువు: సార్వత్రిక ఎన్నికల కోడ్ అమలులో ఉన్నందున స్థానిక పీటీయం రోడ్డులో ఆదివారం పోలీసులు వాహనాల తనిఖీ నిర్వహించారు. మద్యం, నగదు అక్రమరవాణా అరికట్టడానికి చర్యల్లో భాగంగా వాహనాల తనిఖీ నిర్వహిస్తున్నట్లు ఎస్ఐ తిప్పేస్వామి తెలిపారు. ఎన్నికల నిబంధనలు ప్రతి ఒక్కరూ పాటించాలని ఎస్ఐ వివరించారు. తనిఖీల్లో పోలీసు సిబ్బంది పాల్గొన్నారు.

వైభవంగా ధ్వజస్తంభ ప్రతిష్ట

ములకలచెరువు: స్థానిక మండల కేంద్రం విద్యుత్‌సబ్ స్టేషన్ వద్ద వెలసిన శ్రీ బోయకొండ గంగమ్మ అమ్మవారి ఆలయం వద్ద ధ్వజస్తంభ ప్రతిష్టను నిర్వాహకులు ఆదివారం వైభవంగా నిర్వహించారు. ఈ సందర్భంగా అమ్మవారికి ప్రత్యేకంగా అలంకరించి ప్రత్యేక పూజలు చేశారు. పలువురు మహిళలు అమ్మవారికి బోనాలు సమర్పించి మొక్కులు తీర్చుకున్నారు. భక్తులకు తీర్థప్రసాదాలను పంపిణీ చేశారు.

సారా స్వాధీనం

పెద్దమండ్యం: విక్రయించడానికి సిద్ధంగా ఉన్న నాటు సారాను స్వాధీనం చేసుకుని ఆదివారం ఒకరిని అరెస్ట్ చేసినట్లు ఎస్ఐ చెన్నకేశవ తెలిపారు. వివరాలిలా ఉన్నాయి. మండలంలోని సి గొల్లపల్లె పంచాయతీ రెక్కలకొండపల్లెకు సమీపంలో నాటుసారా తయారీ, విక్రయాలు జరుగుతున్నట్లు అందిన సమాచారం మేరకు సిబ్బందితో వెళ్లి దాడులు నిర్వహించినట్లు తెలిపారు. రెక్కలకొండపల్లె హరిజనవాడకు చెందిన ఏ సిద్దప్ప (72) వద్ద విక్రయించడానికి సిద్ధంగా ఉన్న 20 లీటర్ల నాటుసారాను స్వాధీనం చేసుకున్నట్లు చెప్పారు. ఈ మేరకు కేసు నమోదు చేసుకుని నిందితుడిని అరెస్ట్ చేసి రిమాండ్‌కు తరలించినట్లు తెలిపారు.

అనాథ ఆశ్రమానికి మిట్స్ చేయూత

కురబలకోట: మదనపల్లె దేవతానగర్‌లోని చైతన్య అనాథ బాలల ఆశ్రమానికి అంగళ్లులోని మిట్స్ ఇంజినీరింగ్ కళాశాల సోషల్ రెస్పాన్సిబుల్ క్లబ్ వారు రూ. 40 వేలు విలువ చేసే కరెంట్ ఇన్వర్టర్, బుక్ రాక్స్‌ను ఆదివారం అందజేసింది. ఈ సందర్భంగా పిల్లలకు భోజన సౌకర్యం కల్పించారు.

నూతన వధూవరులకు ఆశీర్వాదం

వాల్మీకిపురం: స్థానిక పద్మావతి కల్యాణమండపంలో ఆదివారం గోనవరపు రవిశంకర్ కుమార్తె మానస వివాహానికి ఎమ్మెల్యే చింతల రామచంద్రారెడ్డి హాజరై వధూవరులను ఆశీర్వదించారు. అలాగే గుర్రంకొండ మండలం తరిగొండ గ్రామం టీటీడీ కల్యాణ మండపంలో నరసింహులు కుమారుడు రాజమణి వివాహానికి ఎమ్మెల్యే హాజరై నూతన వధూవరులను ఆశీర్వదించారు. కార్యక్రమంలో ఉపసర్పంచ్ కేశవరెడ్డి, మానవతా సంస్థ జిల్లా అధ్యక్షులు కృష్ణమూర్తి, గోనవరపు శీనాస్వామి పాల్గొన్నారు.

క్షయ రహిత సమాజమే లక్ష్యం


మదనపల్లెలో ర్యాలీ నిర్వహిస్తున్న వైద్య ఆరోగ్య సిబ్బంది


వాల్మీకిపురంలో ర్యాలీ నిర్వహిస్తున్న ఆరోగ్యశాఖ సిబ్బంది

మదనపల్లె : క్షయ రహిత సమాజమే లక్ష్యంగా వైద్య ఆరోగ్య సిబ్బంది పనిచేయాలని జిల్లా ఆసుపత్రి వైద్యులు శ్రీధర్, లక్ష్మీకళ, సందీప్ అన్నారు. ఆదివారం ప్రపంచ క్షయ వ్యాధి దినోత్సవం సందర్భంగా ప్రభుత్వ జిల్లా ఆసుపత్రి నుంచి స్థానిక బెంగళూరు బస్టాండ్ వరకు అవగాహన ర్యాలీ నిర్వహించారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ.. టీబీ లక్షణాలు, నివారణమార్గాలను ప్రజలకు అవగాహన కలిగిస్తూ కరపత్రాలను పంపిణీ చేశారు. సరైన చికిత్స ద్వారా టీబీ నివారణ సాధ్యమని అన్నారు. నర్సింగ్ సూపరింటెండెంట్ ఆర్.విజయ జిల్లా ఆసుపత్రి లో పనిచేస్తున్న వైద్యులు,నర్సింగ్ , టిబి విభాగం, జనచేతన సిబ్బందితో టీబిని అంతం చేయగలం, టీబిని ఓడించండి, దేశాన్ని గెలిపించండి, అంటూ ప్రతిజ్ఞ చేయించారు. కార్యక్రమంలో టీబీ విభాగం సిబ్బంది ప్రభాకర్, దయాలన్ , కాంతి, సుశీల , తరుణ్ , ఏ.ఆర్.టి సిబ్బంది పురుషోత్తం , లీలా , భరత్ , ఫార్మసిస్ట్ చంద్ర శేఖర్ తదితరులు పాల్గొన్నారు.

అవాహనతోనే క్షయ నివారణ

తంబళ్లపల్లె: అవగాహనతోనే క్షయ వ్యాధిని నివారించవచ్చునని స్థానిక సీహెచ్‌సి మెడికల్ ఆఫీసర్ డాక్టర్ వెంకటరామయ్య అన్నారు. ఆదివారం ప్రపంచ క్షయ వ్యాధి నివారణ దినోత్సవం సందర్భంగా ఎన్‌టీఈపీ ఆధ్వర్యంలో వైద్య సిబ్బందితో కలిసి ర్యాలీ నిర్వహించారు. ఆయన మాట్లాడుతూ క్షయ వ్యాధి లక్షణాలు ఉన్న వారు స్థానిక ప్రభుత్వ ఆస్పత్రిలో పరీక్షలు చేసుకోవాలన్నారు అనంతరం ప్రతిభ కనబరిచిన వైద్య సిబ్బందికి సర్టిఫికెట్లు అందజేశారు. కార్యక్రమంలో ఎన్‌టీఈపీ సూపర్‌వైజర్ రామకృష్ణ, ఎల్‌టీ యాదగిరి, వైద్యులు విక్రాంత్ రెడ్డి, నరసింహరాజు, రివర్స్ సిబ్బంది తదితరులు పాల్గొన్నారు.

పెద్దతిప్పసముద్రంలో..

పెద్దతిప్పసముద్రం: స్థానిక ప్రాథమిక ఆరోగ్య కేంద్రంలో ఆదివారం ప్రపంచ క్షయ వ్యాధి దినోత్సవాన్ని వైద్య సిబ్బంది ఘనంగా నిర్వహించారు. స్థానిక బస్టాండ్ వరకు ర్యాలీ నిర్వహించారు. క్షయ వ్యాధి నిర్మూలన కోసం ప్రజల్లో అవగాహన కల్పించడం, రోగులకు సకాలంలో వైద్య సేవలందించిన ఉత్తమ ఏఎన్ఎం, ఎంఎల్‌హెచ్‌వో, ఆశా వర్కర్లను కందుకూరు, పీటీఎం పీహెచ్‌సీ డాక్టర్లు శంకర్, ఎండీ యస్దానీ, సూపర్‌వైజర్ రామక్రిష్ణ నాయుడు, ఎంపీహెచ్ఎస్ విజయ్‌కుమార్‌లు ఘనంగా సన్మానించారు.

క్షయ నిర్మూలన అందరి బాధ్యత

బి.కొత్తకోట: క్షయవ్యాధి నిర్మూలన అందరి బాధ్యతని స్థానిక సీహెచ్‌సీ మెడికల్ ఆఫీసర్ డాక్టర్ కిరణ్‌కుమార్ అన్నారు. ఆదివారం క్షయవ్యాధిపై ప్రజల్లో అవగాహన కల్పించేందుకు సీహెచ్‌సీ నుంచి ఆరోగ్య సిబ్బంది, కృషిసంస్థ సిబ్బంది, ఆశ కార్యకర్తలు బస్టాండ్ వరకు ర్యాలీ నిర్వహించారు. కార్యక్రమంలో వైద్యులు ఆరివుల్లా, హసీనా పర్వీన్, ల్యాబ్‌టెక్నీషియన్లు రియాజ్, లక్ష్మి కాంత్, శ్రీనివాసులు, యల్లయ్య పాల్గొన్నారు.

టీబీ వ్యాధిని అంతం చేద్దాం

వాల్మీకిపురం: చేయిచేయి కలిపి టీబీ వ్యాధిని అంతం చేద్దామని జిల్లా టీబీయూనిట్ వైద్యాధికారి రమేష్‌బాబు అన్నారు. ఆదివారం ప్రపంచ క్షయవ్యాధి నిర్మూలన కార్యక్రమంలో భాగంగా పట్టణంలోర్యాలీ నిర్వహించి అవగాహన సదస్సు నిర్వహించారు. ఈసందర్భంగా ఆయన మాట్లాడుతూ క్షయవ్యాధిని తరిమికొడదాం, ఆరోగ్యంగా ఉందాం అని అన్నారు. అనంతరం ఉత్తమ సేవలు అందించిన ఆరోగ్యసిబ్బందికి ప్రశంసా పత్రాలను, జ్ఞాపికలను అందజేశారు.

కలకడలో

కలకడ : మనఅందరి పంతం-టీబీ అంతం అని మండలంలోని ఎర్రకోటపల్లె పీహెచ్‌సీ వైద్యాధికారి డాక్టర్ జవహర్‌బాబు అన్నారు. ఆదివారం క్షయవ్యాధి నివారణ దినోత్సవం పురస్కరించుకుని మండలంలోని ఎర్రకోటపల్లె పీహెచ్‌సి పరిధిలోని పాపిరెడ్డిగారిపల్లెలో అంగాహన ర్యాలీ నిర్వహించారు. కార్యక్రమంలో యంపీహెచ్ఈఓ జయరామయ్య, సూపర్‌వైజర్లు వెంకటేశ్వరరావు, రెడ్డెమ్మ, పీహెచ్ఎన్ సుబ్బరత్నమ్మ, సిబ్బంది వాణి, వరలక్ష్మి, గురుశాంతి, పార్వతి, రమణమ్మ, ఆలివేలు, మంగభాయి, సునిత, తదితరులు పాల్గొన్నారు.

వైభవంగా చక్రస్నాన మహోత్సవం

గుర్రంకొండ: మండలంలోని తరిగొండ గ్రామంలో వెలసిన శ్రీ లక్ష్మీనరసింహస్వామి ఆలయంలో చక్రస్నానం కమనీయంగా నిర్వహించారు. స్వామివారి బ్రహ్మోత్సవాల్లో భాగంగా ఆదివారం ఉదయాన్నే స్వామివార్లకు తోమాలసేవ, తిరుచ్చి ఉత్సవాలు నిర్వహించారు. స్వామివారి మండపంలో స్వామివారికి ఊంజల్‌సేవ నిర్వహించారు. అర్చకులు రంగునీళ్లు, పునుపునీళ్లు ఒకరిపై ఒకరు చల్లుకొంటూ కోలాహలంగా వసంతోత్సవం నిర్వహించారు. అనంతరం స్నపన తిరుమంజనం వైభవంగా జరిపించారు. స్వామివారి ఆయుధాలైన శంఖు చక్రాలను పవిత్ర జలాలతో శాస్త్రోక్తంగా శుద్ధి చేస్తూ చక్రస్నాన మహోత్సవం నిర్వహించారు. తొమ్మిది రోజుల పాటు ఎటువంటి లోపాలు, ఆటంకాలు జరగకుండా బ్రహ్మోత్సవాలు ముగియడంతో ధ్వజాఅవరోహణం నిర్వహించారు. ఏకాంత సేవతో ఉత్సవాలు ముగిశాయి. బ్రహ్మోత్సవాలను పురస్కరించుకొని పెద్ద ఎత్తున భక్తులు ఆలయానికి చేరుకొని స్వామివారికి పూజలు నిర్వహించారు. అర్చకులు భక్తులకు తీర్థప్రసాదాలను పంపిణీ చేశారు.


స్వామివారికి చక్రస్నానం చేయిస్తున్న దృశ్యం

టీడీపీ నుంచి వైఎస్సార్‌సీపీలో చేరిక

కేవీపల్లె: మండలంలోని నూతనకాల్వ పంచాయతీ దిండువారిపల్లెకు చెందిన టీడీపీ నాయకులు, కార్యకర్తలు వైఎస్సార్‌సీపీలో చేరారు. ఆదివారం పీలేరు, కేవీపల్లె మండలాల ఎన్నికల ఇన్‌ఛార్జ్ పెద్దిరెడ్డి సుధీర్‌రెడ్డి, మాజీ ఎమ్మెల్యే జీవీశ్రీనాథరెడ్డి సమక్షంలో 20 కుటుంబాలకు చెందిన టీడీపీ వారు వైఎస్సార్‌సీపీలో చేరారు. గ్రామానికి చెందిన యల్లారెడ్డి, కృష్ణారెడ్డి, వెంకట్రమణారెడ్డి, గంగిరెడ్డి, మహేశ్వర్‌రెడ్డి, శ్రీనాథరెడ్డి, రామకృష్ణారెడ్డి, నాగవయ్యరెడ్డి, వెంకటేష్‌రెడ్డి, మోహన్‌రెడ్డి, వెంకటరెడ్డి, కొండారెడ్డి, రెడ్డెప్పరెడ్డిల తోపాటు పలువురు పార్టీలో చేరారు. వీరికి పార్టీ కండువాలను కప్పి పార్టీలోకి సాదరంగా ఆహ్వానించారు. మండలపార్టీ కన్వీనర్ వెంకట్రమణారెడ్డి, నాయకులు సాహిత్‌రెడ్డి, దేవేంద్రారెడ్డి, సుబ్బారెడ్డి, రమేష్‌రెడ్డి, ఆంజనేయులు, అస్లాం పాల్గొన్నారు.


వైఎస్సార్‌సీపీలో చేరిన వారికి పార్టీ కండువాలను కప్పి ఆహ్వానించిన సుధీర్‌రెడ్డి

మత సామరస్యానికి ప్రతీక ఇఫ్తార్

మదనపల్లె సిటీ: పవిత్ర రంజాన్ మాసంలో ఇఫ్తార్ విందు ప్రజల మధ్య సోదరభావం, మతసామరస్యాన్ని పరిమళింపజేస్తుందని వైఎస్సార్‌సీపీ మదనపల్లె నియోజకవర్గ ఎమ్మెల్యే అభ్యర్థి ఎస్.నిసార్ అహ్మద్ పేర్కొన్నారు.ఆదివారం స్థానిక బెంగుళూరు బస్టాండు నందు ఫ్రూట్ వెండర్స్ అసోసియేషన్ ఇఫ్తార్‌విందు ఏర్పాటు చేశారు. ఆయన మాట్లాడుతూ పవిత్ర దైవారాధనకు, ధార్మిక చింతనకు, దైవభక్తికి క్రమశిక్షణకు, దాతృత్వానికి రంజాన్ మాసం ఆలవాలమన్నారు. మనిషి సత్ప్రవర్తనలో నడవడానికి రంజాన్ ఉపవాసాలు ఉపకరిస్తాయన్నారు. అనంతరం సామూహిక నమాజు ప్రార్థనలు చేశారు. మున్సిపల్ వైస్ చైర్మన్లు జింకా వెంకటాచలపతి, జిల్లా వక్ఫ్‌బోర్డు చైర్మన్ కరీముల్లా, నూర్ ఆజం, కౌన్సిలర్లు ఖాజా, అసోసియేషన్ సభ్యులు రఫీ.వహీద్ తదితరులు పాల్గొన్నారు.

టీడీపీ, బీజేపీ, జనసేన కూటమితో ముస్లింలకు చేటు

కలికిరి: రాష్ట్రంలో టీడీపీ, బీజేపీ, జనసేన కూటమితో ముస్లింలకు చేటు తప్పదని రాష్ట్ర మైనార్టీ కమిషన్ చైర్మన్ డాక్టర్ ఇక్బాల్ అహ్మద్ ఖాన్ అన్నారు. మండలంలోని మేడికుర్తి గ్రామ పంచాయతీ పరిధి సన్యాసివారిపల్లి, మేడికుర్తి కస్పాలో ఆదివారం ఆయన ఇంటింటా ఎన్నికల ప్రచారం నిర్వహించారు. ఈ సందర్భంగా ముస్లింలనుద్దేశించి ఆయన మాట్లాడుతూ కేంద్రంలోని బీజేపీతో ముస్లింలు అనేక ఇబ్బందులు పడుతున్నారని, రాష్ట్రంలో త్వరలోనే ముస్లింలకున్న నాలుగు శాతం రిజర్వేషన్‌లను కూడా రద్దు చేయడానికి బీజేపీ పెద్దలు యోచిస్తున్నారన్నారు. అటువంటి బీజేపీతో జతకట్టిన టీడీపీ ముస్లింల ప్రయోజనాలను గాలికొదిలేసి అధికారం దక్కించుకోవడమే లక్ష్యంగా ముందుకు సాగడం శోచనీయమన్నారు. వైఎస్సార్‌సీపీని అధికారంలోకి తీసుకురావడానికి మైనార్టీలు ఏకతాటిపై నిలవాలన్నారు. కార్యక్రమంలో మార్క్‌ఫెడ్ మాజీ చైర్మన్ నల్లారి తిమ్మారెడ్డి, జెడ్పీటీసీ సభ్యురాలు పద్మజ, మండల ప్రత్యేక ఆహ్వానితులు రత్నశేఖర్‌రెడ్డి, శివాజీ, సర్పంచ్‌లు నాగవేణి, వెంకటరెడ్డి, గంగయ్య, తస్లీమారియాజ్, సురేందర్‌రెడ్డి, ఎంపీటీసీ సభ్యుడు అల్లాబక్షు, వైఎస్సార్‌సీపీ మండల కన్వీనర్ రమేష్‌కుమార్‌రెడ్డి, రాష్ట్ర ప్రధాన కార్యదర్శి అఫూమొహిద్దీన్, ఎస్సీసెల్ జిల్లా ప్రధాన కార్యదర్శి ఎస్టీడి హరి, ఆర్.మధుసూదన్‌రెడ్డి, మైనార్టీ జేఏసీ వ్యవస్థాపకుడు హనీఫ్, సచివాలయ కన్వీనర్ విజయారెడ్డి తదితరులు పాల్గొన్నారు.


మేడికుర్తిలో ప్రచారం నిర్వహిస్తున్న ఇక్బాల్ అహ్మద్

ఓటు హక్కు స్వేచ్ఛగా వినియోగించుకోవాలి

మదనపల్లె : సార్వత్రిక ఎన్నికల నేపథ్యంలో ప్రజలు తమ ఓటుహక్కు స్వేచ్ఛగా వినియోగించుకునేలా మదనపల్లె పట్టణంలోని టూటౌన్ పోలీస్‌స్టేషన్ పరిధిలో ఆదివారం ఫ్లాగ్‌మార్చ్ నిర్వహించారు. సాయంత్రం ఐదు గంటలకు నిమ్మనపల్లె సర్కిల్ నుంచి బసినికొండ రాములవారిగుడివీధి, శేషప్పతోట, బీకే.పల్లె, సుభాష్‌రోడ్డు, బర్మావీధి, కమ్మగడ్డవీధి, రామభూపాల్‌నాయుడువీధి, జీఎం.నగర్, సీటీఎంరోడ్డు, శివాలయం, టౌన్‌బ్యాంక్ సర్కిల్, అనంతయ్యబంగ్లా, బంటూ బజార్, ఆంజనేయస్వామిగుడివీధి, చలపతిరావుకాలనీ, వారపుసంత, మెట్రోసర్కిల్, జెడ్పీహైస్కూల్, అంబేద్కర్ సర్కిల్ వరకు కేంద్ర, పోలీసు బలగాలతో కవాతు చేశారు.

సార్వత్రిక ఎన్నికలకు గట్టి బందోబస్తు

కలకడ : సార్వత్రిక ఎన్నికలు శాంతియుతంగా, సజావుగా నిర్వహించడానికి గట్టి బందోబస్తు ఏర్పాటు చేయనున్నట్లు సీఐ శ్రీనివాసులు, ఎస్ఐ రామక్రిష్ణారెడ్డి తెలిపారు. ఆదివారం మండలంలోని కె.బాటవారిపల్లె నుంచి కలకడ, యర్రయ్యగారిపల్లె, గుర్రంకొండరోడ్డు మార్గంలో పోలీసులు మిలటరీ సిబ్బందితో సిబ్బందితో కవాతు నిర్వహించారు.

ఎన్నికల్లో బీజేపీ కూటమిని ఓడిద్దాం

బి.కొత్తకోట: సార్వత్రిక ఎన్నికల్లో బీజేపీ, దాని మిత్రపక్ష పార్టీలను ఓడించేందుకు అందరూ ఏకం కావాల్సి ఉందని సీపీఐ జిల్లా కార్యదర్శి పీఎల్.నరసింహులు అన్నారు. ఆదివారం స్థానిక పార్టీ కార్యాలయంలో నియోజకవర్గ కార్యవర్గ సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ రాజ్యాంగ హక్కులను కాలరాస్తున్న బీజేపీని ఓడించి దేశాన్ని రక్షించుకోవాల్సిన తక్షణ అవసరం ప్రతి కమ్యూనిస్టు పార్టీ కార్యకర్త పైనా, ప్రజలపైనా ఉందన్నారు. బీజేపీ కేంద్రంలో అధికారం చేపట్టాక ఆదివాసీల భూములపై తీసుకువచ్చిన భూసేకరణ విధానం తప్పులతడకగా ఉందన్నారు. నల్ల చట్టాలపై దేశవ్యాప్తంగా జరిగిన రైతు ఉద్యమంలో కేంద్రం ఇచ్చిన హామీలను ఇంతవరకు అమలు చేయలేదన్నారు. వచ్చే ఎన్నికల్లో ఎలాగైనా అధికారంలోకి రావాలని ప్రజల్లో భావోద్వేగాలు రెచ్చగొట్టి ఓట్లు పొందాలని చూస్తున్నారని ఆరోపించారు. పెరిగిన నిత్యావసరాల ధరలు, పన్నుల భారం, పెట్రోల్, డీజిల్, వంటగ్యాస్ ధరల పెంపు, నిరుద్యోగం తదితర ఇబ్బందులతో ప్రజలు సతమతమవుతున్నా పట్టించుకోలేదని విమర్శించారు. రాష్ట్రానికి అన్నింటిలోనూ అన్యాయం చేసిన బీజేపీతో ఇక్కడి పార్టీలు జత కట్టడం దారుణమన్నారు. జిల్లా కార్యవర్గ సభ్యులు కృష్ణప్ప, నియోజకవర్గ కార్యదర్శి ఎస్.మనోహర్ రెడ్డి, కార్యవర్గ సభ్యులు ఎస్.జబీర్‌ఖాన్, డి.చిన్నరెడ్డెప్ప, కే.అంజన్నప్ప, ఎం.అష్రఫ్‌అల్లి, జి.రఘునాథ్, ఎస్.తంబయ్యశెట్టి, హెచ్.షమీవుల్లా,జి.ఆనంద్, జి.నారాయణస్వామి పాల్గొన్నారు.

రెడ్డెమ్మ తల్లీ..కరుణించమమ్మా

గుర్రంకొండ: మండలంలోని చెర్లోపల్లె గ్రామంలో వెలసిన రెడ్డెమ్మతల్లి ఆలయం ఆదివారం భక్తుల రద్దీతో కిటకిటలాడింది. ఈసందర్భంగా ఆలయంలో అమ్మవారికి ప్రత్యేక పూజలు, అభిషేకాలు నిర్వహించారు. ఆలయానికి వేకువజాము నుంచే భక్తులు చేరుకొన్నారు. కోనేట్లో స్నానమాచరించి అమ్మవారి ఎదుట సంతాన కోసం వరపడ్డారు. మొక్కులు తీరిన భక్తులు అమ్మవారికి బంగారు, వెండి, చీరెసారెలతో మొక్కులు చెల్లించుకొన్నారు. పలువురు అమ్మవారికి భక్తిశ్రద్ధలతో తలనీలాలు సమర్పించారు. పలువురు భక్తులు అన్నదాన కార్యక్రమాలు నిర్వహించారు.

క్రీస్తు మార్గం అనుసరణీయం

కురబలకోట: క్రీస్తు మార్గం అనుసరణీయమని మంగళగిరికి చెందిన దైవ వర్తమానికులు డాక్టర్ ఓబేద్ జాన్ ప్రకాష్ పేర్కొన్నారు. అంగళ్లులోని సీయోను ప్రార్థన మందిరంలో ఆదివారం ఆరాధన, బల్ల వర్తమానంలో వాక్య పరిచర్య గావించారు. ముఖ్య అతిథిగా ఆయన సందేశమిస్తూ క్రీస్తు మతాన్ని స్థాపించడానికి రాలేదన్నారు. మారు మనస్సు, విశ్వాసం, నడవడిక, ప్రవర్తనతో పాటు సన్మార్గం, పాప విమోచన గురించి బోధించారన్నారు. శాంతియుత జీవితం ఎలా గడపాలో ఆయన నిజజీవితంలో ఆచరించి చూపి యావత్ ప్రపంచానికి మార్గదర్శకంగా నిలిచారన్నారు. క్రీస్తును అనుసరించేవారే క్రైస్తవులన్నారు. భయభక్తులు కల్గిన వారికి దేవుని ఆశీస్సులు లభిస్తాయన్నారు. సీయోను ప్రార్థన మందిరం ప్రధాన పాస్టర్ విక్టర్ వేదనాయకమ్, సహ పాస్టర్లు శ్యామ్యుయేల్, భాస్కర్, జయరాజ్ తదితరులు పాల్గొన్నారు.

గిరిజన యానాది మేల్కొలుపు సమావేశం

పీలేరు: ఆంధ్రప్రదేశ్ గిరిజన యానాది సేవా సంఘం రాష్ట్ర అధ్యక్షుడు పులి శ్రీనివాసులు, రాష్ట్ర గౌరవ అధ్యక్షులు జానం గంగిరెడ్డి ఆధ్వర్యంలో ఆదివారం గిరిజన యానాది మేల్కొలుపు సభ జరిగింది. గిరిజన,యానాది సంఘాల మహా కూటమి రాష్ట్ర అధ్యక్షులు, ప్రధాన కార్యదర్శులు బాపట్ల వెంకటపతి, పరమాల గోపి మాట్లాడుతూ రాష్ట్రంలో అత్యంత వెనుకబడి, దీనావస్థలో జీవిస్తున్నది గిరిజన, యానాది జాతి అన్ని తెలిపారు. ఎన్ని ప్రభుత్వాలు మారినా గిరిజన యానాది బతుకులు ఎక్కడ వేసిన గొంగళి అన్న చందంగా ఉందన్నారు. యానాదాలు అత్యధిక శాతం ఉన్నప్పటికి వారికి రాజకీయ సాధికారత లేదని ఆవేదన వ్యక్తం చేశారు. రాష్ట్రంలో 28 గిరిజన,యానాది సంఘాలు కలిసి మహా కూటమిగా ఏర్పడిందన్నారు. భవిష్యత్తులో యానాది సంఘాల మహాకూటమి రాజకీయ పార్టీగా అవతరించబోతుందన్నారు.

మహా కూటమి జిల్లా శాఖ ఏర్పాటు :

జిల్లా చైర్మన్‌గా గడ్డం శ్రీనివాసులు ,అధ్యక్షుడిగా కుప్పం శ్రీనివాసులు, ప్రధాన కార్యదర్శిగా వెంకటేశ్వర, కోశాధికారిగా సిద్దు, ఆర్గనైజింగ్ సెక్రటరీగా రెడ్డప్ప, జాయింట్ సెక్రటరీగా రెడ్డప్ప,జాయింట్ సెక్రటరీగా రెడ్డప్ప, జాయింట్ సెక్రటరీగా తిరుపాల్, కార్యదర్శిగా వెంకటేష్, గౌరవ అధ్యక్షులు, మీడియా సమన్వయకర్తగా జానం గంగిరెడ్డి ఏకగ్రీవంగా ఎన్నికయ్యారు.

గజవాహనంపై గట్టువెంకటరమణుడు

రామసముద్రం: రామసముద్రం మండలం చెంబకూరులో వెలసిన శ్రీగట్టు వెంకటరమణస్వామి బ్రహ్మోత్సవాలలో భాగంగా ఆదివారం రాత్రి స్వామివారు గజవాహనంపై ఊరేగారు. ఉదయం స్వామివారికి ప్రత్యేక పూజలు, పంచామృతాభిషేకాలు ఘనంగా నిర్వహించారు. చుట్టు పక్కల గ్రామాల నుంచి అధిక సంఖ్యలో భక్తులు హాజరై స్వామివారికి పూజలు నిర్వహించి, మొక్కులు చెల్లించుకున్నారు.

బ్యాంకు రుణాలను సకాలంలో చెల్లించండి

మదనపల్లె : ది మదనపల్లె కో-ఆపరేటివ్ టౌన్ బ్యాంక్ నుంచి అప్పు తీసుకున్న ఖాతాదారులు వాయిదా మీరిన కంతులను సకాలంలో చెల్లించి, బ్యాంకు అభివృద్ధికి సహకరించాలని కో-ఆపరేటివ్ అసిస్టెంట్ రిజిస్ట్రార్ ఎం.శ్యామ్‌ప్రకాష్‌రెడ్డి, సీఈఓ పెరవలి ప్రసాద్ కోరారు. ఆదివారం బ్యాంకు ప్రధాన కార్యాలయంలో సాధారణ మహాజనసభ సమావేశం జరిగింది. ఈ సందర్భంగా సీఈఓ పెరవలిప్రసాద్ మాట్లాడుతూ...ఈ ఏడాది ప్రారంభాన బ్యాంకు వ్యాపారధనం రూ.145.49 కోట్లు ఉండగా, ఫిబ్రవరి29 నాటికి రూ.147.72 కోట్లుగా ఉందన్నారు. బ్యాంకు డిపాజిట్లు రూ.89.47 కోట్లు కాగా, సభ్యుల నుంచి రావాల్సిన అప్పులు రూ.58.25 కోట్లు ఉందన్నారు. బ్యాంక్ సొంత నిధులు రూ.11.75 కోట్లు ఉన్నాయన్నారు. అప్పు తీసుకున్న ఖాతాదారుల నుంచి వాయిదా మీరిన అప్పులు 7శాతం లోపల ఉండాలని నిబంధన ఉందని, అయితే ప్రస్తుతం 9.84 శాతంగా ఉందని, కంతులు సరిగా చెల్లించని ఖాతాదారులు తక్షణమే చెల్లించాలన్నారు. టౌన్‌బ్యాంక్ రూ.19.97 కోట్లు ప్రభుత్వ సెక్యూరిటీలో డిపాజిట్ చేసిందని, అలాగే ఇతర వాణిజ్యబ్యాంకుల్లో రూ.22.46 కోట్లు డిపాజిట్లు మొత్తం కలిపి రూ.42.43 కోట్లు ఉన్నాయన్నారు. వ్యాపారస్తులకు బంగారునగలపై రైలీలోను, ఓవర్‌డ్రాఫ్ట్ సదుపాయం కల్పించేందుకు నిర్ణయం తీసుకున్నామని, వ్యాపారస్తులు అవకాశాన్ని సద్వినియోగం చేసుకోవాలన్నారు. జూన్ 24వ తేదీకి టౌన్ బ్యాంక్ స్థాపించి 100 సంవత్సరాలు పూర్తి అవుతున్న నేపథ్యంలో శతాబ్ది ఉత్సవాలు ఘనంగా జరిపేందుకు నిర్ణయించామన్నారు. బ్యాంక్ మేనేజర్లు జయచంద్రానాయుడు, రవిచంద్రారెడ్డి పాల్గొన్నారు.


మాట్లాడుతున్న సీఈఓ పెరవలిప్రసాద్

జగనన్నను మనసారా ఆశీర్వదించండి

పీలేరు రూరల్ : మరింత అభివృద్ధి, సంక్షేమం ఆకాంక్షిస్తూ రాష్ట్ర ముఖ్యమంత్రి వై.ఎస్. జగన్‌మోహన్ రెడ్డిని మనసారా ఆశీర్వదించాలని పీలేరు, కేవీపల్లె మండలాల వైఎస్సార్‌సీపీ ఎన్నికల ఇన్‌చార్జి పెద్దిరెడ్డి సుధీర్‌రెడ్డి, మాజీ ఎమ్మెల్యే జీ.వి. శ్రీనాథరెడ్డి అన్నారు. ఆదివారం మండలంలోని తలుపుల పంచాయతీ చెరుకువారిపల్లె, అబ్బవరంవారిపల్లె, అప్పిరెడ్డిగారిపల్లె, జంగంపల్లె, వడ్డిపల్లె, భయ్యారెడ్డిగారిపల్లెలో ఎన్నికల ప్రచారం నిర్వహించారు. వారు మాట్లాడుతూ గత ఎన్నికల సందర్భంగా జగన్‌మోహన్‌రెడ్డి ఇచ్చిన హామీలన్నీ వంద శాతం అమలు చేసి మాటమీద నిలబడిన వ్యక్తిగా పేరొందారని పేర్కొన్నారు. ముఖ్యమంత్రి వైపు ధర్మం, న్యాయం ఉన్నాయని, జగన్‌కు ప్రజలందరూ అండగా నిలవాలని పిలుపునిచ్చారు. ఎంపీగా మిథున్‌రెడ్డిని, ఎమ్మెల్యేగా చింతల రామచంద్రారెడ్డిని మరోసారి గెలిపించాలని పిలుపునిచ్చారు. కార్యక్రమంలో శిరీషానందీప్‌రెడ్డి, ఎంపీటీసీ వెంకటరమణనాయుడు, నాయకులు మల్లికార్జునరెడ్డి, మస్తాన్, తిమ్మయ్య, చక్రపాణిరెడ్డి, శేఖర్, బాలిరెడ్డి, మదనమోహన్‌నాయుడు, తిరుపాల్, సంతోష్‌నాయుడు, నిరంజన్‌రెడ్డి, ఆంజి, రవి, ఎస్.వి. చలపతి పాల్గొన్నారు.

'మనాలీ స్మృతులు' పుస్తకావిష్కరణ

మదనపల్లె సిటీ: స్థానిక ప్రశాంత్‌నగర్‌లోని జ్ఞానోదయ పాఠశాలలో ఆదివారం ప్రజా చైతన్య ప్రవంతి ఆధ్వర్యంలో మనాలీ స్మృతులు పుస్తకావిష్కరణ చేశారు. ప్రభుత్వ మహిళా డిగ్రీ కాలేజ్ అధ్యాపకురాలు జింకల మోహన్‌వల్లి తన యాత్రా అనుభవాలతో రచించారు. ప్రముఖ రచయిత,సాహితీ విమర్శకులు వేంపల్లి సికిందర్ పుస్తకావిష్కరణ చేశారు. నవలా రచయిత టీఎస్ఏ కృష్ణమూర్తి మాట్లాడుతూ హిమాలయ పర్వతాలలోని మనాలిలో ఎన్ఎస్ఎస్ క్యాంపులో పాల్గొన్న మోహన్‌వల్లి తన అనుభవాలను అద్భుతంగా పుస్తకరూపంలో తీసుకురావడం అభినందనీయమన్నారు. ఎలెక్స్‌హేలి, ఎం.ఆదినారాయణ, కట్టమంచి బాలకృష్ణారెడ్డి, మధురాంతకం నరేంద్ర మొదలైన వారి రచనల బాటలో సాగిన మనాలి స్మృతులు పుస్తకాన్ని సమీక్షించారు. రచయిత్రి జింకాల మోహన్‌వల్లి, గొల్లపూడి తిరుపతిరావు, విక్రాంత డైట్ ప్రిన్సిపల్ శ్రీనివాసులు, కొడవటి ప్రభాకర్, బాలాజీ, వాసా కృష్ణమూర్తి, మోహన్‌బాబు, రమణాచారి పాల్గొన్నారు.


పుస్తకావిష్కరణ చేస్తున్న రచయితలు

తెలుగు అధ్యాపకుడు ఆకస్మిక మృతి

మదనపల్లె : పట్టణంలోని దేవతానగర్‌లో నివాసం ఉంటున్న తెలుగు అధ్యాపకులు, మదనపల్లె డివిజన్ తెలుగు పండిత పరిషత్ గౌరవ అధ్యక్షులు టి.నారాయణ(58) ఆదివారం ఆకస్మికంగా మృతి చెందారు. ఉదయం ఇంట్లో తీవ్ర అస్వస్థతకు లోనైన ఆయనను కుటుంబసభ్యులు వెంటనే ప్రభుత్వ జిల్లా ఆస్పత్రికి తరలించారు. పరీక్షించిన వైద్యులు అప్పటికే మృతి చెందినట్లు నిర్ధారించారు. నారాయణ స్వస్థలం నదుం మండలం నడిగడ్డ కాగా, మదనపల్లె, గుర్రంకొండ, తరిగొండ జెడ్పీహైస్కూల్‌లో తెలుగు ఉపాధ్యాయులుగా పనిచేసి, ఇటీవల పదోన్నతిపై వాల్మీకిపురం పీవీసీ.జూనియర్ కళాశాల తెలుగు అధ్యాపకులుగా నియమితులయ్యారు. ఆయనకు భార్య జానకి, కుమారుడు ఉమేష్‌చంద్, కూతురు హంపి ఉన్నారు. నారాయణ మృతికి మదనపల్లె ఎంఈఓలు ప్రభాకరరెడ్డి, రాజగోపాల్, చౌడేపల్లె ఎంఈఓ తిరుమలమ్మ, పలువురు ఉపాధ్యాయులు మృతదేహాన్ని సందర్శించి సంతాపం వ్యక్తం చేశారు.

సర్పంచ్ కుటుంబాన్ని పరామర్శించిన ఎమ్మెల్యే

కేవీపల్లె : మండలంలోని గ్యారంపల్లె సర్పంచ్ రెడ్డెప్ప తల్లి తిమ్ములమ్మ మృతి చెందింది. విషయం తెలుసుకున్న ఎమ్మెల్యే ఆదివారం గ్యారంపల్లెకు చేరుకుని తిమ్ములమ్మ మృతదేహానికి పూల మాల వేసి నివాళులర్పించారు. రెడ్డెప్ప కుటుంబ సభ్యులను పరామర్శించారు.